విద్య, వైద్యరంగాలకు పెద్దపీట



ఓ.వి.పేటలో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాన్ని ప్రారంభిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం
- స్పీకర్ తమ్మినేని సీతారాం



లచ్చయ్యపేటలో మాట్లాడుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

బూర్జ: రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాల పురోగతికి నిర్దిష్టమైన ప్రణాళికలతో అడుగులు వేస్తోందని ఆంధ్రప్రదేశ్ శాసన సభాపతి తమ్మినేని సీతారాం అన్నారు. బూర్జ మండలంలోని ఓ.వి.పేటలో రూ.17.50 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ విలేజ్ క్లినిక్ భవన సముదాయాన్ని శనివారం ప్రారంభించారు. అలాగే కంట్లాం పంచాయతీ లచ్చయ్యపేటలో నాడు-నేడు రెండో దశలో భాగంగా రూ.25 లక్షలతో పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతు రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగాన్ని గ్రామ స్థాయిలో ప్రతీ ఒక్కరికి అందుబాటులోకి తీసుకువచ్చేందుకు వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు ప్రారంభించడం జరిగిందన్నారు. ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్‌ను (ఫ్యామిలీ ఫిజిషియన్ పోగ్రాం) ప్రజలు సద్వినియోగ పర్చుకుంటున్నారన్నారు. ప్రతీ సచివాలయం పరిధిలో ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు వైద్య సిబ్బంది గ్రామంలో అందుబాటులో ఉంటున్న విషయాన్ని గుర్తుచేశారు. 14 రకాల పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. వైద్య సిబ్బంది వద్ద 67 రకాల మందులు అందుబాటులో ఉంటాయన్నారు. నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా భవనాల ఆధునీకరణ, సుందరీకరణ పనులు నిర్దేశిత ప్రమాణాలతో చేపట్టడం జరుగుతుందన్నారు. పాఠశాలలకు అవసరమైన మౌలిక వసతులు, బాలికలకు ప్రత్యేకమైన టాయిలెట్స్ సమకూర్చడం జరుగుతుందన్నారు. ఆమదాలవలస నియోజకవర్గ పరిశీలకులు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురామ రాజు మాట్లాడుతూ దేశంలోనే విజన్ ఉన్న ముఖ్యమంత్రి ఒక్క జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. విద్య, వైద్య, వ్యవసాయ రంగాలకు పెద్దపీట వేస్తున్నామన్నారు. ఎంపీపీ కర్నేన దీప, జెడ్పీటీసీ బెజ్జిపురపు రామారావు, మండల ప్రత్యేక ఆహ్వానితుడు కర్నేన నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు, స్థానిక సర్పంచ్, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు సూరపు ఉదయ్‌కుమార్, ఓ.వి.పేట సర్పంచ్ మెట్ట అమ్మాజమ్మ, వైస్ ఎంపీపీలు కరణం కృష్ణమూర్తి నాయుడు, బుడుమూరు సూర్యారావు, డీసీఎంఎస్ డైరెక్టర్ జల్లు బలరాం నాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు బగాది నారాయణమూర్తి, మండల ప్రధాన కార్యదర్శి ఇసాయి వెంకటరావు, మాజీ ఏఎంసీ డైరెక్టర్ గుమ్మడి రాంబాబు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం



మాట్లాడుతున్న సారిపల్లి ప్రసాదరావు, తదితరులు

కొత్తూరు: సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సారిపల్లి ప్రసాదరావు, పీఏసీఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ అన్నారు. కొత్తూరులో శనివారం విలేకరుల సమావేశాన్ని పార్టీ నాయకులతో కలిసి ఏర్పాటు చేశారు. గ్రామ సచివాలయం వ్యవస్థ ఏర్పాటైనప్పటి నుంచి ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలు పార్టీలకు అతీతంగా అర్హులందరికీ నేరుగా అందజేస్తున్నామన్నారు. గత టీడీపీ ప్రభుత్వ పాలనలో జన్మభూమి కమిటీలకు చెల్లింపులు జరిగితే తప్ప పథకాలు మంజూరు జరిగేవికావన్నారు. నిస్వార్ధంతో సేవలు అందిస్తున్న గ్రామ వలంటీర్లపై కొంతమంది టీడీపీ నాయకులు విషం కక్కేలా మాట్లాడటం సరికాదన్నారు. నూతనంగా నియమించిన వైఎస్సార్‌సీపీ జగనన్న సచివాలయం కన్వీనర్లు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. గృహ సారధులతో కలిసి పనిచేయాలన్నారు. పార్టీ నాయకులు గోగుల వరప్రసాదరావు, పడాల లక్ష్మణరావు, లోతుగెడ్డ తిరుపతిరావు, గండివలస ఆనందరావు, పంకజదాస్, వడమ శ్రీనివాసరావు, సర్పంచ్‌లు వై.ధర్మరావు, ఎస్.అశోక్‌కుమార్, ఎంపీటీసీ వనుము లక్ష్మీనారాయణ, ఎస్.తమ్మినాయుడు, బి.తవిటినాయుడు, నాగేంద్ర, బి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్



బహుమతులు అందజేస్తున్న సూర్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు

కొత్తూరు: క్రీడల్లో రాణించినవారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందని కొత్తూరు మండల పీఏసీఎస్ అధ్యక్షుడు చింతాడ సూర్యనారాయణ అన్నారు. ఒంద్రుజోల గ్రామంలో ఒంద్రుజోల యూత్ పేరుతో నిర్వహించిన డివిజన్ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ శనివారంతో ముగిసింది. టోర్నీ విజేతగా నిలిచిన మెట్టూరు బిట్-1 పునరావాస కాలనీకి చెందిన పాడలి క్రికెట్ జట్టుకు జ్ఞాపికలను సూర్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు గోగుల వరప్రసాదరావు, పడాల లక్ష్మణరావు అందజేశారు. సూర్యనారాయణ మాట్లాడుతూ ఇటువంటి పోటీలు నిర్వహించడంతో గ్రామీణ క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీయవచ్చన్నారు. టోర్నమెంట్‌ను ఒంద్రుజోలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు గంధవరపు నాగేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించారు. ఒంద్రుజోల ఉప సర్పంచ్ చింతాడ వెంకటసత్యం, వైఎస్సార్‌సీపీ నాయకుడు వడమ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలి



పోస్టర్‌ను విడుదల చేస్తున్న సెట్‌శ్రీ మేనేజర్, కళాశాల సిబ్బంది

ఆమదాలవలస: విద్యార్థులు ఇంటర్మీడియెట్ స్థాయి నుంచి ఒక లక్ష్యం ఏర్పాటు చేసుకొని ఆత్మవిశ్వాసం పెంపొందించుకుంటే ఉజ్వల భవిష్యత్ సొంతం అవుతుందని సెట్‌శ్రీ మేనేజర్ వి.వి.అప్పలనాయుడు అన్నారు. ఆమదాలవలస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ పీఓ జె.రవిబాబు ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ బి.శ్యామసుందర్ అధ్యక్షతన శనివారం వ్యక్తిత్వ వికాశం, విద్య, ఉద్యోగం, ఆటలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సెట్‌శ్రీ మేనేజర్ మాట్లాడుతూ యువజన సర్వీసుల శాఖ ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్‌లో అవగాహన కల్పిస్తుందన్నారు. ఉన్నత విద్య, భవిష్యత్ లక్ష్యాలు సాధించేందుకు, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకునేందుకు ఈ శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. దీన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యా ఉద్యోగ దీపిక పోస్టర్‌ను విడుదల చేశారు. ప్రత్యేక డిప్యూటీ తహసీల్దార్ ఎల్.వి.నాయుడు, అసిస్టెంట్ మేనేజర్ కె.వి.రమణ, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆశాజనకంగా మొక్కజొన్న సాగు



కొరసవాడ ప్రాంతంలో సాగుచేస్తున్న మొక్కజొన్న

పాతపట్నం: ఈ ఏడాది రబీలో మొక్కజొన్న సాగు ఆశాజనకంగా ఉంది. మండలంలోని కొరసవాడ, బూరగాం, కాపుగోపాలపురం, కాగువాడ, సీది, ప్రహరాజపాలెం, చంగుడి తదితర గ్రామాల్లో ఈ పంటను రైతులు ఎక్కువగా సాగుచేస్తున్నారు. వరి అనంతరం రబీ సీజన్‌లో ఈ పంటను సాగు చేస్తుంటారు. మండలంలోని సుమారు 600 ఎకరాల్లో పంటను సాగు చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి కె.రవి కుమార్ తెలిపారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించడానికి దోహదపడుతుందని రైతులు అంటున్నారు. మొక్కజొన్న పంటకు కనీస మద్దతు ధర కల్పించాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

రుచి, శుచి తప్పనిసరి



మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ శ్రీనివాస్

ఎల్.ఎన్.పేట: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వండి పెట్టే జగనన్న గోరుముద్ద మధ్యాహ్న భోజనం రుచికరంగా పెట్టాలని ఎంఈఓ ఎస్.శ్రీనివాస్ వంట ఏజెన్సీలకు సూచించారు. మండల కేంద్రంలోని రోటరీ నగర్ కాలనీలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని శనివారం పరిశీలించారు. మీ ఇంట్లో పిల్లలకు వండి పెట్టినట్లు బడిలో విద్యార్థులకు అంతే రుచిగా వండాలన్నారు. భోజనం ఎలా ఉంటుందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు భోజన పథకంపై దృష్టి సారించాలన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం



గృహ నిర్మాణదారులకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ రేణుక

ఆమదాలవలస రూరల్: జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాల పట్టాలు పొందిన లబ్ధిదారులు గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీఓ ఎం.రేణుక అన్నారు. మండలంలో కలివరం పంచాయతీ ముద్దాడపేట గ్రామంలో గల జగనన్న కాలనీని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలకు పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు. నిర్మాణాలు చేపట్టేవారికి ప్రభుత్వపరంగా ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లింపు జరిగేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. హౌసింగ్ ఏఈ రమేష్, ఎలక్ట్రికల్ రూరల్ ఏఈ బి.రవికుమార్, పంచాయతీరాజ్ ఏఈ జ్యోతి, ఏపీఎం పి.కూర్మారావు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ చంద్రమౌళి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి



రాపాకలో వైద్య సేవలు అందిస్తున్న దృశ్యం

పొందూరు: గ్రామీణ ప్రజానీకానికి సకాలంలో వైద్య సేవలను అందజేసేందుకు ప్రభుత్వం చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారులు పి.శివశంకర్, మణికంఠ కోరారు. మండలంలోనిలో రాపాక గ్రామంలో శనివారం హెల్త్ వెల్‌నెస్ కేంద్రంలో 104 వాహనం ద్వారా వైద్య సేవలను అందజేశారు. ఈ సందర్భంగా గ్రామంలో గర్భిణులు, బాలింతలు, మంచం పట్టిన రోగులు, ఇతర వ్యాధిగ్రస్తులకు వైద్య సేవలందించారు. ఎంఎల్‌హెచ్‌పీ లావణ్య, జ్యోత్స్న, ఏఎన్ఎంలు ఉదయలక్ష్మి, వనజాక్షి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలతో జీవితాలు నాశనం



మాట్లాడుతున్న ఎస్ఐ ప్రభాకరరావు

కొత్తూరు: యువత మత్తు పదార్థాలు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని కొత్తూరు సెబ్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ డి.ప్రభాకరరావు అన్నారు. కొత్తూరులోని శ్రీవెంకటసాయి విద్యాసంస్థలో శనివారం మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనార్థాలపై శనివారం అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలకు యువత అలవాటు పడితే నిండు జీవితం అంధకారం అవుతుందన్నారు. మత్తుకు బానిస అయితే వ్యక్తిత్వం కోల్పోవడంతోపాటు అనారోగ్యం పాలవుతారన్నారు. మాదకద్రవ్యాలు అక్రమ రవాణా చేసినా, నిల్వ చేసినా, విక్రయాలు చేసినా తమకు సమాచారం అందజేస్తే పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. స్టేషన్ సిబ్బంది, అధ్యాపకులు పాల్గొన్నారు.

కూర్మ గ్రామం సందర్శన



కూర్మ గ్రామాన్ని సందర్శించిన స్వరాజ్యం, తదితరులు

హిరమండలం: మండలంలోని కూర్మ (వైదిక) గ్రామాన్ని రెడ్డి పరిశ్రమల ఫౌండర్, చైర్మన్ కల్లం అంజిరెడ్డి సతీమణి స్వరాజ్యం, హైదరాబాద్‌కు చెందిన లయన్స్ క్లబ్ మహిళా ప్రతినిధులు శనివారం సందర్శించారు. ఈ గ్రామంలోని ఇస్కాన్ భక్తుల ఆధ్యాత్మిక జీవన విధానాలు, గ్రామ ప్రత్యేకతలు తెలుసుకున్నారు. రెడ్డి పరిశ్రమల జనరల్ మేనేజర్ కె.వి.ఎస్.ఎన్.రాజు, అడ్మిన్ ప్రవీణ్ ఉన్నారు.

● ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు



నరసన్నపేటలోని కూచిపూడి నృత్య విద్యాలయం 11వ వార్షికోత్సవం సందర్భంగా బాలికల నృత్య ప్రదర్శనుల ఆకట్టుకున్నాయి. స్థానిక పంచాయతీ కార్యాలయ వేదిక వద్ద శనివారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలు వివిధ నృత్య ప్రదర్శనలు చేశారు. నృత్య విద్యాలయం అధ్యక్షురాలు పి.చంద్రావతి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు, సొసైటీ అధ్యక్షుడు పాగోటి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. - నరసన్నపేట

కన్వీనర్ల వ్యవస్థపై తప్పుడు ప్రచారం తగదు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పాతపట్నం: పరిపాలన సౌలభ్యం కోసం గ్రామ సచివాలయ కన్వీనర్ల వ్యవస్థను ప్రభుత్వం తీసుకువచ్చిందని, దీనిపై తెలుగుదేశం పార్టీ నాయకులు చేస్తున్న దుష్ప్రచారం తగదని మండల వైఎస్సార్‌సీపీ నాయకులు ఏఎంసీ చైర్మన్ కొండాల అర్జునుడు, వైస్ ఎంపీపీ సవిరిగాన ప్రదీప్ అన్నారు. శనివారం పాతపట్నంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వీరు విలేకరులతో మాట్లాడారు. పార్టీలకు అతీతంగా ప్రజలకు సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందజేస్తుందన్నారు. అది చూసి ఓర్వలేకే టీడీపీ నాయకులు విమర్శలు చేయడం అన్యాయమన్నారు. వలంటీర్ వ్యవస్థను ఎన్నికల కోసం ఉపయోగించుకుంటారని తప్పుడు ప్రచారం చేయడం సమంజసం కాదన్నారు. కరోనా కష్టంకాలంలో వలంటీర్లు స్వచ్ఛందంగా ప్రజలకు సేవలు అందించారన్నారు. పార్టీ నాయకులు దొర పార్వతీశం, పనుకు మోహన్, మజ్జి జోగారావు, ఏనుగుతల సూర్యం, డకర చిన్నారావు, సత్య బిసోల్, నాగేష్, బెనియా వెంకటరమణ, శ్రీధర్, గోపి, భోగిరాజు తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



జ్ఞానజ్యోతి డిగ్రీ కళాశాలలో బెంచీలపై నంబర్లు వేస్తున్న సిబ్బంది

నరసన్నపేట: మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించనున్న పోలీస్ కానిస్టేబుల్ ఎంపిక ప్రిలిమినరీ పరీక్ష కోసం ఏర్పాట్లు పూర్తయ్యాయి. 10 సెంటర్లలో పరీక్షలు జరుగుతుండగా 2,760 మంది అభ్యర్థులు పాల్గొనున్నారు. స్థానిక సీఐ రాము, ఎస్ఐ సింహాచలంలు మాట్లాడుతూ అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. కట్టుదిట్టంగా పరీక్షలు నిర్వహించనున్నామని తెలిపారు. పరీక్ష కేంద్రాలకు 30 నిమిషాలు ముందుగానే హాజరుకావాలన్నారు. 2106 మంది పురుషులు, 654 మంది మహిళలు పరీక్షలు రాస్తున్నారని తెలిపారు. ఎంఎల్‌ఆర్ నాయుడు డిగ్రీ కళాలలో 300 మంది, ప్రిజమ్ డిగ్రీ కళాశాలలో 240 మంది, జ్ఞానజ్యోతి డిగ్రీ కళాశాలలో 400 మంది, ఎల్‌వీఆర్ డిగ్రీ కళాశాలలో 300 మంది, పద్మావతి డిగ్రీ కళాశాలలో 240 మంది, డీఆర్ఎన్ డిగ్రీ కళాశాలలో 240 మంది, జ్ఞానజ్యోతి జూనియర్ కళాశాలలో 300 మంది, సంపత్ సాయి జూనియర్ కళాశాలలో 200 మంది, పద్మావతి జూనియర్ కళాశాలలో 240 మంది, శాంత జూనియర్ కళాశాలలో 300 మందిని కేటాయించినట్లు తెలిపారు.

క్యాన్సర్‌పై అవగాహన



ఎల్.ఎన్.పేట:మాట్లాడుతున్న డాక్టర్ ప్రియాంక



బూర్జ: క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి పావని

ఎల్.ఎన్.పేట: ప్రాణాంతకరమైన క్యాన్సర్ వ్యాధి బారిన పడకుండా ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని జిల్లా మాస్ మీడియా అధికారి డాక్టర్ పైడి వెంకటరమణ, స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పి.ప్రియాంక అన్నారు. మండలంలోని లక్ష్మీనర్సుపేట గ్రామంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద క్యాన్సర్ అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. పొగాకు, ఖైనీ, గుట్కా, పాన్‌పరాగ్, ఆల్కహాల్ వంటి మత్తు పదార్థాలతోపాటు కొవ్వును పెంచే ఆహారాలను తినటం వల్ల క్యాన్సర్ బారిన పడే ప్రమాదం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ సరైన ఆహార నియమాలను పాటిస్తూ క్యాన్సర్ వ్యాధికి దూరంగా ఉండాలని అవగాహన కలిగించారు. ఆరోగ్య సూపర్‌వైజర్ బి.జనార్దన రావు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

బూర్జలో..

బూర్జ: క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలని బూర్జ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఐ.పావని అన్నారు. పీహెచ్‌సీ ఆవరణలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శనివారం క్యాన్సర్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. క్యాన్సర్ శరీరంలోని ఏభాగానికైనా సోకవచ్చన్నారు. అన్ని రకాల క్యాన్సర్ల గురించి తెలియజేస్తు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.


భౌ పెడుతున్నాయ్..



సరుబుజ్జిలిలో గుంపుగా సంచరిస్తున్న కుక్కలు

సరుబుజ్జిలి: మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో కుక్కలు బెడద ఎక్కువగా ఉన్నాయి. రాత్రి వేళల్లో గుంపులుగా వీధుల్లో సంచరిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీధుల్లోకి అడుగుపెట్టాలంటే భయం వేస్తుందన్నారు.పశువుల శాలల్లో ఉన్న ఆవులు, దూడలు, గొర్రెలను కూడా గాయపరుస్తున్నాయన్నారు. కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అరటి గెలల నీరాజనం



ఆలయ ప్రాంగణంలో వేలాడదీసిన అరటి గెలలు

సారవకోట: మండలంలోని తొగిరి అభయాంజనేయ స్వామి ఆలయ ఆవరణలో అరటి గెలలను భక్తులు వేలాడదీశారు. ఆలయ వార్షికోత్సవం పురస్కరించుకుని భక్తులు మొక్కలు తీర్చుకున్నారు. శనివారం స్వామి వారిని తమలపాకులతో అభిషేకం చేసి ప్రత్యేక, విశేష పూజలు చేపట్టినట్లు అర్చకులు రామానుజాచార్యులు తెలిపారు.

మండల కన్వీనర్ల నియామకం

నరసన్నపేట: నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు సచివాలయాల మండల కన్వీనర్లుగా వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులను పార్టీ అధిష్టానం నియమించింది. ఈ మేరకు నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నరసన్నపేటకు సురంగి నర్సింగరావు, సారవకోటకు నక్క తులసీదాస్, జలుమూరుకు ధర్మాన జగన్, పోలాకి మండలానికి కణితి సత్తిబాబును నియమించారు. పార్టీ తమకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తామని కన్వీనర్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

డివిజన్ స్థాయి స్పందన రేపు

కొత్తూరు: మెళియాపుట్టి మండలం నేలబొంతులో ఈ నెల 23న టెక్కలి డివిజన్ సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి డివిజన్ స్థాయి స్పందన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చినట్లు తహసీల్దార్ పి.బాల శనివారం తెలిపారు. స్పందనను డివిజన్, మండల ప్రజలు వినియోగించుకోవాలన్నారు.

ఘనంగా రంగస్థల పద్య నాటకపోటీలు

హిరమండలం: చీమకుర్తి నాగేశ్వరరావు కళాపీఠం ద్వితీయ వార్షికోత్సవ సందర్భంగా మండలంలోని సుభలయ ఆర్అండ్ ఆర్ కాలనీ కమ్యూనిటీ భవనంలో శనివారం రాష్ట్ర స్థాయి రంగస్థల పద్య, నాటక పోటీలు కళాపీఠం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. చీమకుర్తి చిత్రపటానికి నివాళులర్పించారు. పోటీల్లో ప్రతిభ చూపిన వారికి బహుమతుల ప్రదానం చేశారు. కళాకారులకు కళాపీఠం తరపున సత్కారించారు. కళాపీఠం అధ్యక్షుడు ఎ.లింగమూర్తి, వ్యవస్థాపకుడు ఎల్.సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, చందరరావు తదితరులు పాల్గొన్నారు.

రక్త హీనతపై అవగాహన ఉండాలి

పొందూరు: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని కింతలి గ్రామంలో పీఎల్ఎన్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో బాలికా దినోత్సవం వారోత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. 11 నుంచి 18 ఏళ్లలోపు బాలికలకు రక్త హీనత, మంచి, చెడు అలవాట్లు, వ్యాధి నిరోధక శక్తిని పెంచుకోవడం వంటి విషయాలపై అవగాహన కల్పించారు. హెచ్ఎం బుడుమూరు గోవిందరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జీవి రత్నం, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

రుణాలు రెన్యువల్ చేసుకోవాలి

జలుమూరు: అల్లాడ, చల్లవానిపేట పీఏసీఎస్‌ల ద్వారా వ్యవసాయ రుణాలు పొందిన రైతులు సకాలంలో వాయిదాలు చెల్లించడంతోపాటు రెన్యువల్ చేసుకుని రాయితీలు పొందాలని ఆయా అధ్యక్షులు పి.ముసలినాయుడు, పి.రాజప్పలనాయుడులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని కోసం రైతులు ఈకేవైసీ చేసుకున్న పట్టదారు పాస్‌పుస్తకం, ఆధార్ తదితర పత్రాలు ఆయా సొసైటీ కార్యాలయాల్లో అందజేయాలన్నారు.

మెనూ సక్రమంగా అమలు చేయాలి



మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలిస్తున్న అధికారులు

సారవకోట: జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా మెనూ సక్రమంగా అమలు చేయాలని ఎంపీడీఓ విశ్వేశ్వరరావు సూచించారు. శనివారం మండలంలోని కిడిమి ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ పాఠశాల చుట్టు పక్కల పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలన్నారు. అనంతరం కిడిమి సచివాలయాన్ని సందర్శించి రికార్డులు, సంక్షేమ పథకాల అమలు తీరు, సిబ్బంది హాజరు పరిశీలించారు. ప్రతీ ఒక్కరూ యూనిఫాం విధిగా ధరించాలన్నారు. ఎంఈఓ ఎం.వి.రమణ ఉన్నారు.

ప్రమాదకరంగా పురాతన బ్రిడ్జిలు



చినకాగితాపల్లి వద్ద ప్రమాదస్థితిలో ఉన్న పురాతన బ్రిడ్జి

సరుబుజ్జిలి: ఆర్అండ్‌బీ రహదారులపై నిర్మించిన బ్రిడ్జిలు కాలపరిమితి తీరి పోవడం వల్ల ప్రమాదస్థితిలో ఉన్నాయని వాహనదారులు వాపోతున్నారు. బ్రిడ్జిల రక్షణ గోడలు కూడా కూలిపోవడం వల్ల వాహనాల రాకపోకలు సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. బ్రిడ్జిల అడుగు భాగం పెచ్చులూడుతున్నట్లు తెలిపారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.